సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024

నాగోబా జాతర షురూ

మెస్రం వంశీయుల మహాపూజతో కేస్లాపూర్‌లో నాగోబా జాతర ప్రారంభమైంది. కొత్త కోడళ్ల గోవడ్ వద్ద శనివారం తమ దేవతలకు నైవేద్యాలు సమర్పించి ఉపవాస దీక్ష విరమించారు. ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. నాగోబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

- వివరాలు 8లో▸



న్యూస్‌రీల్

ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు



ఎరోడ్రమ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఎరోడ్రమ్ భూములను రెవెన్యూ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఎరోడ్రమ్‌కు ప్రభుత్వం కేటాయించిన స్థలం, దాని సరిహద్దు వంటి వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూర్తి వివరాలు అందజేయాలని అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురికా కుండా రెవెన్యూ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములను సంరక్షించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ యజువేందర్ రెడ్డి, సర్వేయర్ శివాజీ, సంతోష్ తదితరులున్నారు.

24 నుంచి టెక్నికల్ కోర్సు పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: ఈనెల 24 నుంచి 27 వరకు డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరి లోయర్, హయ్యర్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. అభ్యర్థులు bse. telangana. gov. in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సెంటర్‌కు గంట ముందుగానే చేరుకోవాలని పేర్కొన్నారు. టైలరింగ్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ వెంట కుట్టుమిషన్ తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుందని వివరించారు.

రోగులకు నాణ్యమైన వైద్యసేవలందించాలి

ఆదిలాబాద్‌టౌన్: స్టాఫ్‌నర్సులు రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. ఇటీవల విధుల్లో చేరిన వారికి సీనియర్ స్టాఫ్ నర్సులు స్వాగతం పలుకుతూ శనివారం రిమ్స్ ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వారికి నర్సింగ్ ఆఫీసర్ బ్యాడ్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోగులతో మర్యాదపూర్వకంగా మెలుగుతూ వైద్యసేవలు అందించాలని సూచించారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ ఆదర్శంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, ఏడీ విజయ, నర్సింగ్ సూపరింటెండెంట్ వనజ పాల్గొన్నారు.

రైల్వేలైన్ సాధన దీక్షలకు విద్యార్థుల మద్దతు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వే లైన్ సాధన కోసం ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఎదుట సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలకు పారామెడికల్ విద్యార్థులు మద్దతు తెలిపారు. శనివారం నాటికి ఈ దీక్షలు 26వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సాధన సమితి చైర్మన్ నారాయణ మాట్లాడుతూ.. రైల్వే లైన్ సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని పేర్కొన్నారు. ఇందులోసమితి నాయకులు అఫ్సర్‌ఖాన్, రఫీక్, నరేందర్, విలాస్‌రావు, పారామెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

12న విద్యా సంస్థలకు సెలవు

కైలాస్‌నగర్: నాగోబా జాతర నేపథ్యంలో ప్రజా దర్బార్ పురస్కరించుకుని ఈనెల 12న జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు లోకల్ సెలవుగా ప్రకటించారు. ఈ మేరకు కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు బదులుగా మార్చి 9న రెండో శనివారం విద్యాసంస్థలను యథావిధిగా నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కాగా ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు ఉన్న ఇంటర్మీడియెట్ కళాశాలలకు ఈ సెలవు వర్తించదని స్పష్టం చేశారు.

ఆత్మీయం.. అ'పూర్వ'ం



కుటుంబసభ్యులతో కలిసి పాత తోయగూడ గ్రామస్తులు

బేల: ఒకటి కాదు..రెండు కాదు.. ఏకంగా 39 ఏళ్ల క్రితం విడిపోయిన ఆ గ్రామస్తులంతా గతేడాది ఫిబ్రవరి 10న తొలిసారి కలుసుకున్నారు. ఈ ఏడాది అదే తేదీన రెండో సారి అ'పూర్వ' సమ్మేళనం పేరిట అదే చోట చేరువయ్యారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఇందుకు బేల మండలంలోని తోయగూడ గ్రామం వేదికైంది. 1984లో జైనథ్ మండలంలో సాత్నాల ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురైన ఆ గ్రామ ప్రజలంతా చెల్లాచెదురై, ఉపాధి నిమిత్తం ఆయా ప్రాంతాలకు వెళ్లిపోయారు. కాలం గడుస్తూ వచ్చింది. ఈ క్రమంలో వారంతా కలుసుకోవాలని నిర్ణయించుకుని గతేడాది ఓ సారి కలిశారు. ఇప్పుడు 40 ఏళ్లు పూర్తయ్యే క్రమంలో మరోసారి శనివారం కలుసుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి ఉదయాన్నే ఇక్కడికి చేరుకొని రోజంతా ఉల్లాసంగా గడిపారు. ఇందులో గ్రామస్తులు శంకర్, తిరుపతి, వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్, నీలకంఠ, సంటెన్న, తదితరులు పాల్గొన్నారు.



మిశ్రమ స్పందన

- ఆరు గ్యారంటీలకే ప్రభుత్వం పెద్దపీట
- జిల్లాకు నేరుగా అందే ప్రయోజనాలు లేవు
- రాష్ట్ర బడ్జెట్‌పై విపక్షాల పెదవివిరుపు
- సంక్షేమానికి పెద్దపీట వేశామంటున్న కాంగ్రెస్
- గత ప్రభుత్వం లాగే మోసం చేసిందంటున్న బీజేపీ
- అంకెల గారడీ అంటూ బీఆర్‌ఎస్ విమర్శ

నేరుగా దక్కని ప్రయోజనాలు..

కొరాట–చనాఖా బ్యారేజ్‌కు ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. కుప్టి ప్రాజెక్టు నిర్మాణ ప్రస్తావన లేదు. దీంతో ఆయా ప్రాజెక్టుల నిర్మాణం, పూర్తిపై నీలినీడలు కమ్ముకునే పరిస్థితి ఉంది. వివిధ పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు సంబంధించి బిల్లుల పేమెంట్ పై కూడా స్పష్టత లేదు. నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టరేట్‌లకు నిధులు కేటాయిస్తామని చెప్పడం జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న సమీకృత కలెక్టరేట్‌కు ప్రయోజనం దక్కే అవకాశం ఉంది.

సాక్షి,ఆదిలాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు నేరుగా ఒనగూరే ప్రయోజనాలు కనిపించట్లేదు. సంక్షేమ పథకాలపరంగా నిధుల కేటాయింపులో జిల్లా వాటా కింద దక్కే ప్రయోజనం ఉన్నదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇదిలా ఉంటే ఇది ఓట్ -ఆన్-అకౌంట్ బడ్జెట్ అని, పూర్తి స్థాయి బడ్జెట్ కాదని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు అంటున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం లాగే కాంగ్రెస్ సర్కారు కూడా ప్రజలను మోసం చేసే విధంగా ఈ బడ్జెట్ ఉందని బీజేపీ అభిప్రాయపడుతోంది. మరో పక్క ఇది పూర్తిగా అంకెల గారడీ అని, తప్పుల తడకగా ఉందని బీఆర్‌ఎస్ విమర్శిస్తోంది.

ప్రయోజనాలు ఇలా..

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఆరు గ్యారంటీల అమలు కోసం ఈ బడ్జెట్‌లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. మహాలక్ష్మీ పథకం కింద రూ.500 గ్యాస్ సిలిండర్ అమలు చేస్తామని స్పష్టం చేసింది. అలాగే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలుపర్చనున్నట్లు పేర్కొంది. ఇదిలా ఉంటే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కింద నియోజకవర్గంలో 3,500 ఇండ్లు నిర్మిస్తామని బడ్జెట్‌లో చెప్పారు. తద్వారా ఇళ్ల నిర్మాణం వేగిరంగా జరిగే అవకాశం ఉంది. తక్కువ బడ్జెట్‌తో పూర్తయ్యే ప్రాజెక్టులపై దృష్టిసారిస్తామని ఇందులో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఐటీఐలను ఆధునికీకరిస్తామని ప్రభుత్వం పేర్కొంది. దీంట్లో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఐటీఐకి కూడా ప్రయోజనం దక్కే అవకాశం ఉంది. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. దీని ప్రయోజనం కూడా దక్కే అవకాశం ఉంది. డిజిటల్ క్లాస్ రూమ్‌ల ఏర్పాటు కింద ప్రయోజనం చేకూరనుంది. మెగా డీఎస్సీ నిర్వహణపై ప్రస్తావించడం నిరుద్యోగులకు ఊరటనిస్తుంది. రైతుబంధు మార్గదర్శకాలను పునఃసమీక్షించి రైతుభరోసా కింద సాయం చేస్తామని పేర్కొన్నారు. కౌలు రైతులకు కూడా ప్రయోజనం దక్కేలా చూస్తామని వెల్లడించారు.

పంచాయతీ, మున్సిపాలిటీలకు ప్రయోజనం కలిగేనా..

పంచాయతీరాజ్, పురపాలక శాఖలకు భారీగా నిధులు కేటాయించింది. తద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనుల కోసం నిధులు సమకూరనున్నాయి. వైద్యరంగానికి నిధుల కేటాయింపులు జరపగా జిల్లాలో వైద్య సేవల అభివృద్ధికి దోహదపడే అవకాశాలు ఉన్నాయి. నీటి పారుదల శాఖకు నిధులు కేటాయించింది. తద్వారా వీటి నుంచి జిల్లాలో నీటి పారుదల అభివృద్ధికి ఏదైనా పనులు చేపట్టే అవకాశం ఉంది.

సంక్షేమానికి పెద్దపీట



పేదల సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్దపీట వేయడం జరిగింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమం కోసం నిధులు కేటాయించడం జరిగింది. విద్యారంగ అభివృద్ధికి ఈ ప్రభుత్వం పాటుపడుతోంది. అందులో భాగంగానే తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వైద్యరంగ అభివృద్ధి కోసం నిధులు కేటాయించడం జరిగింది.

– వెడ్మ బొజ్జు, ఎమ్మెల్యే ఖానాపూర్

భూసేకరణకు నిధులేవి..?



జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పరంగా భూసేకరణకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. అలాగే బోథ్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఈ బడ్జెట్ అంతా తప్పుల తడకగా ఉంది. అలాగే కుప్టి ప్రాజెక్టు ప్రస్తావనే లేదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

– అనిల్ జాదవ్, ఎమ్మెల్యే, బోథ్

అధ్యయనం పేరిట తాత్సారం..



కాంగ్రెస్ పార్టీ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీల అమలుపరంగా అధ్యయనం పేరిట తాత్సారం చేస్తున్నారు. పంటల బీమా తీసుకవస్తామని చెప్పి దానిపై స్పష్టత ఇవ్వకపోవడం బోద్యం. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజనలో రైతుల వాటాను రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తే వారికి ప్రయోజనం దక్కుతుంది. 56 శాతం ఉన్న బీసీలకు బడ్జెట్‌లో ఆ స్థాయిలో ప్రయోజనం దక్కలేదు. రూ.2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేసే విధంగా బడ్జెట్‌లో నిధుల మంజూరు లేదు.

– పాయల్ శంకర్, ఎమ్మెల్యే, ఆదిలాబాద్

'గృహజ్యోతి'కి శ్రీకారం

- వినియోగదారుల వివరాలు సేకరిస్తున్న విద్యుత్‌శాఖ
- అద్దెకు ఉంటున్న వారికి సైతం పథకం అమలు
- ఈనెల 16 వరకు సేకరణ ప్రక్రియ

జిల్లాలో..
మొత్తం విద్యుత్ కనెక్షన్లు: 2.09లక్షలు
గృహ వినియోగదారుల కనెక్షన్లు: 1,58,502
200లోపు యూనిట్లు వినియోగించేవారు: 1,17,498
స్పాట్ బిల్లర్స్: 56



వివరాల సేకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎస్ఈ జేఆర్ చౌహాన్, జిల్లా నోడల్ అధికారి దేవేందర్

ఆదిలాబాద్‌టౌన్: గృహజ్యోతి పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు హామీల్లో భాగంగా ఇప్పటికే మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తుండగా తాజాగా మరో పథకం అమలుకు సన్నద్ధమవుతుంది. ఇందులో భాగంగా 200 యునిట్లలోపు విద్యుత్ వినియోగించుకునే గృహ వినియోదారుల వివరాల సేకరణకు విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వినియోగదారుల ఇంటింటికి వెళ్లి ఆధార్‌కార్డు, ఆహార భద్రత కార్డు, సెల్ నంబర్‌ను మొబైల్ బిల్లింగ్ మిషన్‌లో నమోదు చేస్తున్నారు. ఈనెల 6న ప్రారంభమైన ఈ ప్రక్రియ 16వరకు కొనసాగనుంది. ఆ తర్వాత ప్రభుత్వం అర్హులను గుర్తించి పథకం అమలుకు ముందుకు సాగనుంది. జిల్లాలో ఇప్పటివరకు జిల్లాలో 15వేల మంది వినియోగదారుల వివరాలు సేకరించారు.

1లక్ష 17వేల మందికి ప్రయోజనం..

జిల్లాలో 200 యూనిట్లలోపు వినియోగం చేసే వారందరికి ఉచిత విద్యుత్ పథకం అమలులోకి రానుంది. దీని ద్వారా సుమారు లక్ష 17వేల మందికి ప్రయోజనం చేకూరనుందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ పరిధిలోపు యూనిట్లు వినియోగించే వారికి ఇప్పటి వరకు నెలకు దాదాపు రూ.వెయ్యి వరకు బిల్లు వస్తుందని చెబుతున్నారు. ఇక సుమారు 30వేల మంది గృహ వినియోగదారులు 200 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

అద్దె ఇళ్లకు సైతం..

ఈ పథకాన్ని ఇంటి యజమానులతో పాటు అద్దెకు ఉంటున్న వారికి సైతం అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఒక ఇంట్లో ఎన్ని మీటర్లు ఉన్నా.. యజమానికి సంబంధించిన ఒక్క మీటర్‌కే వర్తిస్తుంది. ఒకవేళ అద్దెకు ఉండే వారికి ఆహార భద్రత కార్డు, ఆధార్ కార్డు ఉంటే వారికి కూడా వర్తించనుంది.

వివరాల సేకరణలో నిమగ్నం..

ఈ పథకంలో భాగంగా విద్యుత్ శాఖ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ వివరాలు సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియ ఈనెల 7న ప్రారంభం కాగా, 16 వరకు పూర్తి చేయనున్నారు. జిల్లాలో 56 మంది స్పాట్ బిల్లర్స్ ఉన్నారు. వీరితో పాటు కార్యాలయాల్లో పనిచేస్తున్న సీనియర్, జూనియర్ అసిస్టెంట్ల సేవలను సైతం వినియోగిస్తున్నారు. ప్రక్రియను పరిశీలించేందుకు 14 మంది వరకు నోడల్ అధికారులను నియమించారు. ఒక స్పాట్ బిల్లర్ ప్రతిరోజు 200 గృహాల వివరాలు నమోదు చేసేలా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఈ ప్రక్రియను ఏఈలు, డీఈలు, ఏడీలు, నోడల్ అధికారులు, లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షిస్తున్నారు. జిల్లాకు నోడల్ అధికారిగా జీఎం ఆడిట్ అధికారి దేవేందర్‌ను విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు నియమించారు.

వినియోగదారులు సహకరించాలి

గృహజ్యోతి పథకానికి సంబంధించి వివరాలు సేకరిస్తున్నాం. ఇంటికి వచ్చే సిబ్బందికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలి. ఆధార్ కార్డు, ఆహార భద్రత కార్డు, ఫోన్ నంబర్, ప్రజాపాలన రశీదును దగ్గర ఉంచుకోవాలి. ఎవరైనాఇంటి వద్ద లేకుంటే మీటర్ వద్ద వివరాలు అతికించాలి. ఈనెల 16 వరకు ఈ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాం.

– జేఆర్ చౌహాన్, విద్యుత్ శాఖ, ఎస్ఈ

తొలి ప్రయత్నంలోనే సాధించా..

- గ్రూప్–4 థర్డ్ ర్యాంకర్ బక్కి సాయికృష్ణ మనోగతం



బక్కి సాయికృష్ణ

తాంసి: తొలి ప్రయత్నంలోనే గ్రూప్–4లో రాష్ట్ర స్థాయి మూడో ర్యాంక్ సాధించడం ఆనందంగా ఉందని అంటున్నాడు తాంసి మండలానికి చెందిన బక్కి సాయికృష్ణ. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. డిగ్రీ వరకు నా చదువంతా ఆదిలాబాద్‌లోనే సాగింది. 2022లో బీఎస్సీ పూర్తి కాగానే ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ప్రిపరేషన్ షురూ చేశాను. ఈ క్రమంలో గ్రూప్–4 నోటిఫికేషన్ వచ్చింది. హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకున్నా. ప్రతిరోజు ప్రణాళికాబద్ధంగా చదివా. రాష్ట్రస్థాయిలోనే మూడో ర్యాంకు (217.226 మార్కులు) సాధించా. నాన్న రమేశ్ హెడ్ కానిస్టేబుల్. అమ్మ మమత గృహిణి. వారి ప్రోత్సాహంతోనే ఇది సాధించగలిగాను. రానున్న రోజుల్లో ఉన్నత ఉద్యోగం సైతం సాధించగలుగాతననే నమ్మకం పెరిగిందని అంటున్నాడు ఈయన.

రేపు జిల్లాకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం రాక

కైలాస్‌నగర్: జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్‌డీఆర్‌ఎఫ్) బృందం ఈ నెల 12న జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా కొండపావులూరులోని 10వ ఎన్‌డీఆర్‌ఎఫ్ బెటాలియన్ బృందం జిల్లాకు రానుందని పేర్కొన్నారు. జైనథ్ మండలంలోని పెన్‌గంగా ముంపు పరివాహక గ్రామాలైన కామాయి, పెండల్వాడ, సాంగ్వీ–కే గ్రామాల్లో ఈ బృందం పర్యటించి వరద సమయంలో అనుసరించాల్సిన చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించనుందని తెలిపారు. ఈ టీం పర్యటన విజయవంతం కోసం జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి ఎన్.వెంకటేశ్వర్లును కోఆర్డినేటింగ్ ఆఫీసర్‌గా నియమించినట్లుగా పేర్కొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలి



విజేతకు ప్రశంసపత్రం అందజేస్తున్న విద్యాసాగర్

ఆదిలాబాద్‌టౌన్: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నేషనల్ గ్రీన్ కార్ప్స్ రాష్ట్ర కోఆర్డినేటర్ విద్యాసాగర్ అన్నారు. ఎన్‌జీసీ ఆధ్వర్యంలో డైట్ కళాశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలపై జిల్లాస్థాయి డ్రామా, రోల్‌ప్లే పోటీలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకంతో అనేక నష్టాలను చవిచూడాల్సి వస్తుందన్నారు. అనంతరం నిర్వహించిన ఆయా పోటీల్లో 30 పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డ్రామా పోటీలో ప్రభుత్వ పాఠశాల (నం.2) ప్రథమ బహుమతి, జెడ్పీఎస్ఎస్ (చాందా) ద్వితీయ బహుమతి, జెడ్పీఎస్ఎస్ తాంసి తృతీయ బహుమతి గెలుపొందారు. రోల్‌ప్లే పోటీలో జెడ్పీఎస్ఎస్ ఖోడద్ ప్రథమ, జెడ్పీఎస్ఎస్ సరస్వతినగర్ ద్వితీయ, జెడ్పీఎస్ఎస్ తలమడుగు పాఠశాల తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. న్యాయనిర్ణేతలుగా నారాయణ, లచ్చిరాం, చంద్రశేఖర్, పొచ్చరెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో ఎన్‌జీసీ జిల్లాకోఆర్డినేటర్ నర్సయ్య, డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, సెక్టోరియల్ అధికారులు జె.నారాయణ, సుజాత్ ఖాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో 'పీఏ' దాదాగిరి!

- పేషెంట్ కేర్ విధులు విస్మరించి.. నర్సింగ్ సూపరింటెండెంట్ పీఏగా చెలామణి
- రెండు రోజుల క్రితం స్టాఫ్ నర్సులకు బెదిరింపులు
- డైరెక్టర్ దృష్టికి వెళ్లడంతో విధుల నుంచి తొలగింపు



పేషెంట్‌కేర్‌లతో సమావేశమైన రిమ్స్ డైరెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో ఓ పేషెంట్ కేర్ దాదాగిరి చెలాయిస్తున్నాడు. తన విధులు పక్కనపెట్టి నర్సింగ్ సూపరింటెండెంట్ పీఏగా చెలామణి అవుతున్నాడు. స్టాఫ్‌నర్సుల హాజరు వేయడంతో పాటు వారితో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడు. విసుగుచెందిన స్టాఫ్ నర్సులు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే స్టాఫ్‌నర్సులు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని రాత్రి సమయంలో వారి ఫొటోలు తీసి నర్సింగ్ సూపరింటెండెంట్‌కు పంపినట్లు సమాచారం. మద్యం మత్తులో ఉన్న సదరు వ్యక్తి ఫొటోలు తీసి హల్‌చల్ చేయడంతో దేహశుద్ధి చేసేందుకు స్టాఫ్ నర్సులు సిద్ధమయ్యారు. మేల్ నర్సులను పిలవడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. ఈఘటన గురువారం రాత్రి చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

పేషెంట్‌కేర్ విధులు విస్మరించి..

రిమ్స్‌లో 110 మంది పేషెంట్‌కేర్‌లు ఉన్నారు. వీరు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తించాలి. నడవలేని స్థితిలో ఉన్న రోగులు ఆస్పత్రికి వస్తే వారిని స్ట్రెచ్చర్‌పై తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే కొంతమంది పేషెంట్‌కేర్‌లు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. అందుబాటులో ఉండి కూడా రోగులను లోనికి తీసుకెళ్లడం లేదు. స్కానింగ్, ఎక్స్‌రే, ఇతర పరీక్షల కోసం తీసుకెళ్లాల్సిన సమయంలో అక్కడ కనిపించకుండా పోతున్నారు. దీంతో రోగుల బంధువులే స్ట్రెచ్చర్‌పై వారిని తీసుకెళ్లాల్సిన దుస్థితి. కాగా కొంత మంది కంప్యూటర్ ఆపరేటర్లుగా, ల్యాబ్ టెక్నీషియన్లుగా, నర్సింగ్ సూపరింటెండెంట్ పీఏగా, ఇతర విధులు చేపడుతూ తప్పించుకుంటూ తిరుగుతున్నారు.

పర్యవేక్షణ పేరిట బెదిరింపులు..

తనకు కేటాయించిన విధులను పక్కనపెట్టి నర్సింగ్ సూపరింటెండెంట్ పీఏగా చెలామణి అవుతూ ఓ పేషెంట్‌కేర్ స్టాఫ్ నర్సులను బెదిరింపులకు పాల్పడుతున్నాడు. కొంత మంది స్టాఫ్ నర్సులు విధులకు డుమ్మా కొడితే వారి నుంచి అందినకాడికి డబ్బులు దండుకొని హాజరు వేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అయితే ఇటీవల మద్యం మత్తులో స్టాఫ్ నర్సులను బెదిరించడమే కాకుండా విధుల్లో ఉన్న వారి ఫొటోలను తీసి హంగామా సృష్టించాడు. విషయాన్ని వారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారితో సమావేశం నిర్వహించి డ్యూటీలు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ విషయమై రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను వివరణ కోరగా.. విధులు విస్మరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగా సూపరింటెండెంట్ పీఏగా ఉన్న వ్యక్తిని తొలగించామన్నారు. అలాగే మిగతా వారితో సమావేశమై డ్రెస్ కోడ్ పాటించాలని ఆదేశించామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేడు 'మహిళా శక్తి సమ్మేళనం'

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 'మహిళా శక్తి సమ్మేళనం' నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని విద్య, వైద్య, సామాజిక, ధార్మిక, సేవ, వ్యాపార, వ్యవసాయ పారిశ్రామిక, రాజకీయ, పత్రిక, తదితర రంగాలలో పనిచేస్తున్న మహిళలందరూ ఈ సమ్మేళనంలో పాలుపంచుకోవాలని కోరారు. రెండు విడుతలుగా కొనసాగే ఈ కార్యక్రమంలో మహిళలని చైతన్యం పరచడం, భారతీయ సంస్కృతి, కుటుంబ విలువల పరిరక్షణ, దేశ సమగ్రాభివృద్ధిలో మహిళా భాగస్వామ్యాన్ని పెంచడం, పలు రంగాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కార మార్గాలను చర్చించడం, మహిళల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ముఖ్యలక్ష్యంగా మహిళా శక్తి సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు వివరించారు. రెండు జిల్లాల్లోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలందరూ ఈ సమ్మేళనంలో భాగస్వాములు కావాలని కోరారు.

నలుగురిపై కేసు నమోదు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రానికి చెందిన గాజుల సాయి, తరుణ్, అజయ్, శ్రావణ్ లక్కారం గ్రామానికి చెందిన సాదని అరవింద్‌కుమార్‌పై పాతకక్షలతో శనివారం దాడి చేశారు. గాయాలపాలైన అరవింద్‌కుమార్‌ను స్థానికులు ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సఅందించారు. బాధితుని ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బేలలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



కలపను సీజ్ చేస్తున్న అధికారులు

బేల: మండల కేంద్రంలోని పలు వడ్రంగుల ఇళ్లలో జిల్లా అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉన్న రూ.28 వేల విలువైన కలపను సీజ్ చేసినట్లు అటవీ శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి వాహబ్ అహ్మద్ తెలిపారు. తనిఖీలు నిర్వహించే సమయంలో అధికారుల విధులకు అడ్డుపడిన వారిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. తనిఖీల్లో అధికారులు ఆర్.గులాబ్, పాండురంగ్, సజన్‌లాల్, శ్యాంసుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

నాగోబా జాతర షురూ

- 202 మంది కొత్త కోడళ్ల భేటింగ్ (పరిచయం)
- ఉపవాస దీక్ష విరమించిన భేటింగ్ కోడళ్లు
- తరలి వస్తున్న భక్తజనం



జాతరకు తరలి వస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: పుష్యమాస్య అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి మెస్రం వంశీయుల మహాపూజతో నాగోబా జాతర ప్రారంభమైంది. మొదటి రోజు శనివారం ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి నాగోబాను దర్శించుకున్నారు. ఈ నెల 15 వరకు అధికారికంగా...మరో రెండు రోజుల పాటు అనధికారికంగా జాతర కొనసాగుతుందని ఈవో రాజమౌళి తెలిపారు

202 మంది కొత్త కోడళ్ల భేటింగ్ (పరిచయం)

గోవడ్ వద్ద బస చేసిన మెస్రం వంశీయులు సంప్రదాయ వాయిద్యాలతో నాగోబా ఆలయానికి చేరుకున్నారు. కొత్త కోడళ్లు తెల్లని దుస్తులు ధరించి భేటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. 202 మంది కోడళ్లకు మెస్రం వంశ మహిళా పెద్దల సహాయంతో సతీదేవత ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. శుక్రవారం రాత్రి ఒంటిగంట నుంచి శనివారం తెల్లవారు జామువరకు భేటింగ్ పూజలు నిర్వహించారు.

ఉపవాస దీక్షలు విరమణ

శుక్రవారం ఉదయం నుంచి కఠోర ఉపవాస దీక్షలతో ఉన్న కొత్త కోడళ్లు శనివారం ఉదయం ఒకరి వెనుక ఒకరు వరుసక్రమంలో మర్రిచెట్టు వద్దగల కోనేరు బావివద్దకు వెళ్లి నీటిని సేకరించారు. ఆ నీటితో గోవడ్ వద్ద దేవతలను శుద్ధిచేసి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించిన అనంతరం సహపంక్తి భోజనాలు చేసి ఉపవాస దీక్షలు విరమించారు.

నాగోబాను దర్శించుకున్న అతిథులు

శుక్రవారం రాత్రి మెస్రం వంశీయుల మహాపూజ అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఇన్‌చార్జి పీవో ఖుష్బుగుప్తా, ఎస్పీ గౌస్ ఆలం దంపతులు, మాజీ ఎంపీ గోడం నగేష్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు నాగోబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మెస్రం వంశీ యులు అతిథులను శాలువాతో సత్కరించి నాగో బా ప్రతిమను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశ పటేల్ మెస్రం వెంకట్‌రావ్, పెద్దలు మెస్రం బాదిరావ్, చిన్ను పటేల్, కోసు కటోడ, కోసేరావ్, మెస్రం ఉద్యోగులు మెస్రం దేవ్‌రావ్, మెస్రం మనోహర్, మెస్రం శేఖర్‌బాబు, మెస్రం సోనేరావ్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఇంద్రవెల్లి: నాగోబా దర్బార్ హాల్‌లో శనివారం రాత్రి ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇంద్రవెల్లి మండలంలోని అంతపూర్, గుడిహత్నూర్ మండలంలోని మచ్చపూర్ కళాకారులు డెంస, గుస్సాడీ నృత్యం చేయడంతో పాటు గుడిహత్నూర్ మండలంలోని తోషం గ్రామానికి చెందిన మర్సుకోల కలబాయి బృందం సభ్యులు కిక్రి వాయిస్తూ పాటలు పాడారు.



నాగోబా క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్,కలెక్టర్ రాహుల్‌రాజ్, పీవో ఖుష్బు గుప్తా, ఎస్పీ గౌస్ ఆలం



ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా దంపతులకు నాగోబా ప్రతిమ ఇస్తున్న పటేల్ వెంకట్‌రావ్



జిల్లా ఎస్పీ గౌస్ ఆలంకు నాగోబా ప్రతిమను అందిస్తున్న మెస్రం వంశీయులు



గుస్సాడీ నృత్యం చేస్తున్న కళాబృందం సభ్యులు



నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు, కలెక్టర్ రాహుల్‌రాజ్



భేటింగ్‌కు హాజరైన మెస్రం వంశ కొత్త కోడళ్లు



కోనేరు నుంచి నీటిని సేకరించడానికి వస్తున్న కొత్త కోడళ్లు

'అలేఖ్య హత్యకు పోలీసుల వైఫల్యమే కారణం'



మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన అలేఖ్య హత్యకు పోలీసుల వైఫల్యమే కారణమని పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల లక్ష్మి, సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య ఆరోపించారు. శనివారం యువతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతికి ఇష్టం లేకున్నా ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని వేధించడంతో పాటు హత్య చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. నిందితుడికి కఠిన శిక్ష విధించాలన్నారు. యువతి పెళ్లి రద్దు చేయించిన విషయం పోలీసుల దృష్టికి వచ్చిన రోజే శ్రీకాంత్ పై కేసు నమోదు చేసి ఉంటే ఈ ఘటన జరిగి ఉండేది కాదన్నారు. పోలీసుల నిర్లక్ష్యం కారణంగా ఉన్మాది చేతిలో యువతి నిండు ప్రాణం పోయిందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు చట్టాలను కఠినతరం చేయాలన్నారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు సమత, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు తిలక్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'నిందితుడి తరఫున వాదించొద్దు'

ఖానాపూర్: అలేఖ్య హత్యకేసులో నిందితుడు శ్రీకాంత్ తరఫున న్యాయవాదులెవరూ వాదించవద్దని కోరుతూ కుటుంబ సభ్యులు శనివారం ఖానాపూర్ బార్ అసోసియేషన్ సభ్యులకు వినతిపత్రం అందజేశారు. ఈ కేసులో నిందితుడికి న్యాయసాయం అందకుండా సహకరించాలని విన్నవించారు.

మద్యం మత్తులో ఒకరు ఆత్మహత్య

జైనథ్: మద్యం మత్తులో పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన దేవల్ల సాయి కుమార్(28), మమత దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సాయికుమార్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి మద్యం మత్తులో పంటచేలోనే పురుగుల మందు తాగాడు. ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ముథోల్: మండలంలోని రాంటెక్ గ్రామానికి చెందిన లలిత (40) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. మృతురాలు కొంత కాలంగా మతిస్థిమితం లేక తిరుగుతుండేది. శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు గాయాలు

తాంసి: మండల కేంద్రానికి సమీపంలో శనివారం ఉదయం బైక్, కారు ఢీకొన్న ఘటనలో తండ్రీకొడుకులకు తీవ్రగాయాలయ్యాయి. భీంపూర్ మండలంలోని గోన గ్రామానికి చెందిన సతీష్ తన కుమారుడితో కలిసి తాంసికి వెళ్తుండగా కారు ఢీకొట్టింది. ఘటనలో బైక్ ప్రయాణిస్తున్న ఇరువురికి గాయాలుకాగా రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు సతీష్‌ను హైదరాబాద్‌కు తరలించారు. కారుతో పాటు బైక్‌ను తాంసి పోలీసులు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

భైంసారూరల్: మండలంలోని లింగా గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కదం పరశురాంకు చెందిన ఇల్లు దగ్ధమైంది. గ్రామస్తులు, రెవెన్యూ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం పరశురాం కుటుంబం శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా శనివారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పివేశారు. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ఈ ప్రమాదంలో రూ.37వేల ఆస్తినష్టం జరిగినట్లు ఆర్ఐ జయరాజ్ తెలిపారు.

మట్కా నిర్వాహకుడి అరెస్ట్

భైంసాటౌన్: పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు. మార్కెట్ ఏరియాలో మట్కా ఆడుతున్నారన్న పక్కా సమాచారం మేరకు శనివారం సాయంత్రం దాడి చేసి చౌదరిగల్లికి చెందిన సయ్యద్ జుబేర్ అనే నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. రూ.8,790 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వసంత పంచమికి వేళాయె..

- రేపటి నుంచి మూడు రోజులు వేడుకలు
- అక్షరాభ్యాసాల కోసం మూడు మండపాలు
- వంద గదుల టీటీడీ సత్రానికి మరమ్మతులు
- ప్రముఖుల కోసమే ఆలయ గెస్ట్‌హౌస్‌లు
- భక్తులకు ఈయేడూ వసతి కోసం కష్టమే..



బాసర ఆలయం

భైంసా: నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో వసంత పంచమి వేడుకలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 12 నుంచి 14 వరకు మూడు రోజులు వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక యేటా ప్రభుత్వం వసంత పంచమి రోజు సరస్వతీ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తూ వస్తోంది. గతేడాది వరకు అప్పటి దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించేవారు. ఇటీవలే రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. దేవాదాయ శాఖ మంత్రిగా కొండా సురేఖ బాధ్యతలు చేపట్టారు. ఈయేడు వసంత పంచమి వేడుకలకు రావాలని ఆలయ వ్యవస్థాపక చైర్మన్ శరత్‌పాఠక్, ఈవో విజయరామారావు, ఆలయ వైదిక బృందం మంత్రి కొండా సురేఖను ఆహ్వానించారు. ప్రముఖులకు సైతం ఆహ్వాన పత్రికలు అందజేశారు. సోమ, మంగళ, బుధవారాల్లో బాసర అమ్మవారి క్షేత్రంలో వసంత పంచమివేడుకలు జరగనున్నాయి.

మూడు చోట్ల మండపాలు...

ప్రతీ వసంత పంచమికి బాసరలో అక్షరాభ్యాస పూజలు భారీగా జరుగుతాయి. దివ్య ముహూర్తాన పిల్లలకు అక్షరాభ్యాస పూజలు చేయిస్తే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారన్న విశ్వాసంతో ఏటా దేశవ్యాప్తంగా భక్తులు ఇక్కడికి తరలివస్తున్నారు. ఏటేటా భక్తులు పెరుగుతుండంతో ఈయేడు ఆలయంలో మూడు చోట్ల అక్షరాభ్యాస మండపాలు ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో అక్షరాభ్యాసాలు జరిగినా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఆలయ అధికారులు చెబుతున్నారు.

ప్రారంభమైన ఏర్పాట్లు....

వసంత పంచమి సందర్భంగా ఆలయంలో ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. క్యూలైన్‌ల కోసం కర్రలతో వరుసలు కడుతున్నారు. భారీకేడ్ల నుంచి భక్తులకు అనుమతించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ వసంత పంచమి సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు భద్రత పరమైన ఇబ్బందులులేకుండా చూస్తున్నారు. క్యూలైన్‌ల వద్ద, ఆలయ ప్రధాన ద్వారం వద్ద, గోదావరి నది సమీపంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. భారీగా వచ్చే వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ కేటాయిస్తున్నారు. వసంత పంచమి దృష్ట్యా బాసరలో ప్రసాదాల తయారీపైన సిబ్బంది దృష్టిసారించారు. గోదావరి తీరంలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు.

చేనేత చీర...

బాసరలో అఖిల భారత పద్మశాలీ సంఘం సభ్యులు వసంత పంచమి రోజున అమ్మవారికి సమర్పించేందుకు చీరను నేస్తున్నారు. ఇందుకోసం పద్మశాలీ సంఘ భవనంలో మగ్గం తీసుకువచ్చి అమ్మవారి చీరను ఇక్కడే నేస్తున్నారు. ప్రత్యేకంగా తయారుచేసిన చీరను వసంత పంచమిరోజున అమ్మవారికి సమర్పించనున్నారు. ఇక బాసర రైల్వే స్టేషన్, బస్టాండ్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

వసతికి ఇబ్బందులే...

వసంత పంచమి వేడుకలకు ముందుగా వచ్చే భక్తులకు వసతి ఇబ్బందులు తప్పేలాలేవు. టీటీడీ వంద గదుల సత్రంలో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఇక్కడ భక్తులకు గదులు కేటాయించే అవకాశం లేదు. ఆలయానికి వెళ్లేమార్గంలో గెస్ట్‌హౌస్‌లు, ఇతర గదులు ఉన్నాయి. 36 గదులు ఉన్నా వీఐపీల కోసమే అందుబాటులో ఉంచుతున్నారు. పెద్ద సంఖ్యలో వీఐపీలు వచ్చిన గెస్ట్‌హౌస్‌లు కేటాయించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఈ ఏడాది కూడా భక్తులకు వసతి కష్టాలు తప్పేలా లేవు. సాధారణ భక్తులు ఇప్పటికే ప్రైవేటు లాడ్జీల్లో గదులను తీసుకున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం

బాసరకు వచ్చే భక్తులకు ఇబ్బందులులేకుండా చూస్తాం. ఈనెల 12 నుంచి 14 వరకు వసంత పంచమి ఉత్సవాలు జరుగుతాయి. ఈనెల 14న బాసర రావాలని దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను ఆహ్వానించాం. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చినా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. వసంత పంచమి రోజున మూడు మండపాల్లో అక్షరాభ్యాసాలు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

– విజయరామారావు, ఈవో

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న నాయకులు

ఖానాపూర్: హత్యకు గురైన అలేఖ్య కుటుంబాన్ని గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ నాయకులు శనివారం పరామర్శించారు. నిందితుడికి శిక్షపడే వరకు తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పోలీసులు హత్య కేసు విషయంలో యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నైతం శ్రీనివాస్, మూలంకల మురళి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నార్నూర్: జిల్లాలోని లంబాడీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని శనివారం శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ నాయకులు ఎస్పీ గౌస్‌ఆలంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్ నాయక్, బానోత్ గజానంద్ నాయక్ మాట్లాడుతూ ఉట్నూర్ పట్టణ కేంద్రంలోని జీసీసీ పెట్రోల్ బంక్ పక్కన ఐదు గుంటల స్థలం కేటాయింపు, బేల మండల కేంద్రంలో శ్రీ సంత్ రామారావు మహారాజ్ విగ్రహావిష్కరణకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాదవ్ గోపాలరావు, రాథోడ్ శేష రావు, అమర్ సింగ్ రాథోడ్, సుధాకర్ ఆడే, రాందాస్ నాయక్ నేతావత్, బానోత్ రామారావు, జాదవ్ బలరాం నాయక్, ఆడే సురేష్, జోహార్ నరేష్, బానోత్ జగన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్ల చోరీ

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి గోదావరి తీరంలో గల రైతుల విద్యుత్ మోటార్ల వైర్లను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. 14 మంది రైతులకు చెందిన మోటార్లకు అనుసందానం చేసిన రూ.60 వేల విలువైన వైర్లను ఎత్తుకెళ్లారని రాజేందర్, లక్ష్మీరాజం, చిన్నయ్య, దేవక్క, సంతోశ్, నారాయణ, హరీశ్, కృష్ణమూర్తి, నర్సయ్య, నర్సయ్య, రాజన్న, రమేశ్ తెలిపారు.